# బలహీనులు

నాకు దేవుడియందు నమ్మకం వుంది. దేవుడంటూ ఒకడు వుండి మనుష్యులు చేసిన పాపపుణ్యాలను విమర్శించి శిక్షిస్తుంటాడనీ అవే మనం జీవితంలో అనుభవించే బాధలు అనీ విన్నాను. నేనీనాడు ఘోరమైన శిక్షకు గురిచెయ్యబడ్డాను. యీ శిక్ష విధింపబడటానికి నేను చేసిన పాపమేమిటా అని చాలాసార్లు ఆలోచించుకున్నాను. కాని ఏమీ అగపడలేదు. అదొక్కటి తప్ప. అదైనా పాపకార్యమా అని ఆలోచిస్తే సందేహంలో పడిపోతుంటాను. జరిగినది యిది.

లోకంలోని సౌందర్యధనులలో నేను ఒక్కర్తిని. రంగు నల్లనైనా అందులో నైగనిగ్యం వుంది. తీర్చిదిద్దిన వంపులతోడి నా సుందరమైన నల్లని కాంతుల శరీరానికి నల్లని వెడల్పాటి బోర్డరులతోటి తెల్లని చీర కట్టుతే నా రూపం ఆరితేరిన చిత్రకారునిచే చిత్రింపబడిన బ్లాక్ అండ్ వైట్ షేడ్స్ చిత్రంలోని ఆకర్షణ వుండేది. ఎదురైన వ్యక్తల్లా నావైపు రెండవసారి చూడకుండా నడచిపోవడం ఆ నా పద్దెనిమిదేళ్ళలో ఎప్పుడూ యెరగను.

అప్పుడు నేను ప్రసిద్ధికెక్కిన జనరల్ హాస్పిటల్‌లో నర్సెస్ ట్రైనింగ్ అండర్‌గో అవుతుండేదానిని. మా వార్డులో రెండు పెద్ద హాల్సుకు నడుమ నడవలో అప్‌స్టేర్సుకు పోయే మెట్లకు ఎదురుగ మా సీట్ వుండేది.

ఒకనాడు తీరికగా కూర్చుని టేబిల్ మీద రిజిస్టరు పేజీలు తిరగ వేస్తూంటే అకస్మాత్తుగా గుర్తించాను – మెట్ల మీద పోతున్న వ్యక్తి ట్రిక్కింగ్‌గా నా వంక చూస్తున్నాడని. తలెత్తి చూస్తే యిరవై, యిరవై అయిదు సంవత్సరాల మధ్య వయస్సులో డీసెంట్ డ్రస్‌లో, వికారంకాని పెరసనాలిటీతో, చేత కేరేజ్ పట్టుకొని జోళ్ళు చప్పుడు కానీయకుండా ప్రయత్నిస్తూ మెట్లెక్కుతున్నాడు.

అతడదే మొదటిసారికాక అంతకుముందు నాలుగైదుసార్లు ఆవిధంగా – పైనున్న తమ తాలూకూ రోగి కోసరం కావోలు – చేతిలో కారేజీతో మెట్లెక్కుతూ నా వంక చూడటం జ్ఞాపకం వచ్చింది. నేనతడివంక చూడగానే దృష్టి తిప్పేశాడు. చివరివరకూ మెట్లన్నీ ఎక్కాక టర్నింగులో యింకొకసారి చూసి నేను గమనిస్తుండటం గుర్తించి దృష్టి చడ్‌న తిప్పేసుకున్నాడు.

నా కతడి చూపులలో ఏదో అసాధారణత్వం అగపడింది. అతడు తిరిగి వెళ్లిపోతున్నప్పుడు కూడా నా వంక చూడటం గమనించాను. అప్పటికి నాకతడి చూపులలోని అర్థం బోధపడలేదు.

తర్వాత రోజూ అతడు మేడ మీదకు వెళ్ళే అప్పుడు నావంక చూస్తు న్నాడో లేదో అబ్జర్వు చేసేదానిని.

ఆ పొడుగాటి దారిలో అంత దూరం నుంచీ చూస్తూ వచ్చి, చూస్తూనే మెట్లు ఎక్కి తిరిగి వెళ్ళిపోవడం కూడా అలానే చూస్తూ వెళ్ళిపోయేవాడు. నేను గాని అటు తిరిగానా తల త్రిప్పేసుకొనే వాడు. ఆఖరి రోజులలో కాబోలు అయిదారుసార్లు నేను చూస్తున్నా ధైర్యంగా చూపు కలిపాడు.

మొదట్లో ఒకసారి అనుకున్నాను– దగ్గరికి పిల్చి 'యేమిటి మిష్టర్ యీ కథ' అంటూ ఒక స్ట్రాంగ్ డోస్ యిద్దామని. తర్వాత అతని భయం చూసేసరికి జాలేసి పోనీ యిప్పుడిందులో పోయేది యేముందని వూరుకున్నాను.

అతడి చూపులకు గురి అయివుంటాయి అనుకున్నాను. యింకా నుదురు మీదకు సన్నని పాయలుగా పడే పెద్ద ముంగురులు కూడా ఆకర్షిస్తూండి వుంటాయ్.

నిజానికి నా సౌందర్యంలోని గొప్పదనం ఆనాడే మొదటిసారి గ్రహించాను. అప్పటి నుంచి నాలో గర్వం జనించి క్రమంగా అభివృద్ధినంది తుదకు నిల్చిపోయింది. నాటి నుంచే నేను నా సౌందర్య అభివృద్ధికి చాలా శ్రద్ధ చూపడం ఆరంభించాను. నా యీ సౌందర్య ధనం చూసుకొనే నేనెంతో మురిసిపోయేదాన్ని. అద్దంలో చూచుకున్నప్పు డల్లా ధనవంతుడు యినుప బీర్వా తెరిచినప్పటి తృప్తి, సంతోషం, గర్వం కలుగుతుండేవి. వీధంట పోయేటప్పుడు బాటసారుల దృష్టులలో మెప్పు చూచి గర్వపడేదానిని. జీవితం తృప్తిగా హాయిగా పరిగెత్తిస్తుండే దానిని. ఆనాడు స్ఫురించకపోయినా యీనాడు అవుపడుతోంది – ఆ నా రెండేళ్ళ ఉత్సాహ జీవితానికీ కారకుడు అతడు అని. అతడే నా వుత్సాహ జీవితమైన నా అజ్ఞాత సౌందర్యాన్ని ఎత్తిచూపాడు. అతడికి నేను నిజంగా చాలా బాకీపడ్డాను కాని... అసలు సంగతి.

చాలా ప్రయత్నం మీద అతడు నా కళ్ళల్లోకీ, తప్పితే నుదురు వంకా మాత్రమే చూస్తున్నాడని నిశ్చయించాను. అయితే ఆ చూపులలో కోరిక ఏదైనా వుందో లేదో ఎంత ప్రయత్నించినా తెల్సింది కాదు.

కాని ఆశ్చర్యమేమిటంటే మొదట అతడి చూపులకు చిరాకు పడినా అతడియందు నాకు యేదో కోరిక కలుగుతున్నట్టు ఒకనాడు గ్రహించాను. శీలపతనాన్ని సహించలేక అది అబద్ధమని అనుకోవడానికి ప్రయత్నించాను. కాని ప్రయత్నించినకొద్దీ నాకతడు కావాలన్న కోరిక ధృవపడింది.

నాలో యీ పరిణామాలన్నీ కలిగి యింకొక అడుగు ముందుకు వెయ్యడమా, మానడమా అని ఆలోచిస్తూ వుంటే

అవాళ అతడు ఒక పేషెంట్‌తో మెట్లు దిగుతుండటం అకస్మాత్తుగా చూశాను. వార్డులోకి పోతున్న దానినల్లా టక్‌న ఆగిపోయాను. అతడు నా వంక వెనుదిరిగి చూస్తూ చూస్తూ వెళ్ళిపోతుంటే బరువెక్కుతున్న గుండెతో నిశ్చలంగా నిల్చిపోయాను. యింకొక నర్సు వచ్చి పలకరించినదాకా నాలో చలనం కలగలేదు.

నా పని నేను చూచుకోబోయాను కాని ఆవాళటికి హాస్పిటల్‌లో వుండడం దుర్భరమనిపించి శలవు పుచ్చుకుని హాస్టల్‌కి పోయి పడుకున్నాను. అక్కడా స్థిమితం చిక్కలేదు. చదువు చాలించే అప్పుడు స్కూలును యింక శాశ్వితంగా విడిచి పెడుతున్నాం అనుకుంటూ బయటికి వచ్చిన తర్వాత హృదయాలు కలిసిన వ్యక్తి శాశ్వితంగా దూరమౌతున్న ప్పుడు పడే బాధపడ్డాను. దుఃఖం ఘనీభవించి యాడవలేక మానలేక యెంతో యాతనపడ్డాను ఆవాళల్లా.

సాయంత్రం యేవో ఆశలు మళ్ళా తలలెత్తగా వార్డుకు పోయి రోజూ అతడు వచ్చే దారివంకే చూస్తూ కూర్చున్నాను. ప్రతిక్షణం యింక మరుక్షణం వస్తాడేమో అనుకుంటూ దీపాలు పెట్టే వేళవరకూ గడిపాను. దీపాలు పెట్టాక యింక పోదామనుకుంటూ ఆశచే కాలయాపన చేస్తూ వుంటే దూరాన అతడు వస్తున్నట్టయింది. ఆ బూటు చప్పుడు అతడిదే– అతడే. ఆనందంతో ఒక్కసారి పొంగిపోయాను. అతడు వచ్చి లైటు క్రింద కుర్చీలో వున్న నన్ను చూస్తూ ఆ స్థలం దగ్గర ఆగిపోయాడు. నేను లేచి నిలుచున్నాను. అడుగు మాత్రం పడలేదు. కొట్టుకొనే గుండెలతో, పావుగంట వరకూ అతడి వంక విడిచి విడిచి చూస్తూ అలా వుండి పోయాను. అతడు కూడా రెండు మూడుసార్లు ఏదో తెగించిన వాడిలా కదులుతూ మళ్ళా మామూలుగా నిల్చుండిపోయే వాడు.

నేను – నిజంగా అప్పటి నా పరిస్థితి వర్ణించేందుకు నాకు సరియైన శక్తి లేదు. నాకు సరిగా జ్ఞాపకం లేదు ఆ స్థితి అంతా. కాని యేం చేశానో మాత్రం లీలగా జ్ఞాపకం వుంది.

లేచి ఏదో పని వున్నట్టు అతడి ప్రక్కనుంచి కొంచం దూరం వెళ్ళి తిరిగి వచ్చేస్తూ అతడి దగ్గర ఆగాను. తర్వాత ఒక్క క్షణం తటపటాయించి అడిగాను.

"ఎవరు మీరు?"

"నేను... నేను.... ఔట్‌సైడర్‌ను"

చాలా గాభరాపడుతూ అన్నాడు.

నేనదెందుచేతో చప్‌న అనాలోచితంగా అనేశాను – అలవాటు ప్రకారం కాబోలు.

"ఔట్‌సైడర్సు సాయింత్రం ఆరు దాటాక యిక్కడ వుండకూడదు".

"మరచిపోయాను. వెళ్ళిపోతాను".

అంటూ తొందర తొందరగా తిరిగైనా చూడకుండా వెళ్ళిపోయాడు. నేనింకొకసారి నిశ్చేష్టనయ్యాను. ఒక్కసారి అనుకున్నాను కాబోలు, పిలుద్దామని. కాని పిలవలేక పోయాను.

పావుగంట తర్వాత హాస్టల్ ముఖం పట్టాను దిగులుగా. రూమ్ చేరే ముందర కళ్ళ నీళ్ళు తిరిగాయి. గదిలో పడి ఏడ్చినంత సేపు ఏడ్చాను.

అతడు వెళ్ళిపోయి రెండు సంవత్సరాలపైన అయింది. యింకొకసారి మరి కలియలేదు. యిప్పటికీ అకస్మాత్తుగా – ఏ అద్దం చూచుకొనే అప్పుడో – అతడి చూపులు మాత్రం అప్పుడప్పుడు నా కళ్ళను గ్రుచ్చుకునే వుంటాయి. హృదయం బరువెక్కి బాధగా ఒక్క మూలుగు మూలిగి విరిగి చులకనవుతుంది.

అప్పుడప్పుడు అనుకుంటూ వచ్చేదానిని – ఆ అమాయకుడిలో యేవేవో కోరికలను రేపి సంతృప్తి పరచకండా నిర్దాక్షిణ్యంగా తరిమేశానే – పాపమతడు, పాపం అతడు యెంత వేదన పడ్డాడో అని.

యింతకూ యిప్పుడు నే చెప్పేదేమంటే – మూన్నెళ్ళ క్రింద నాలో ఒకటి పాడయిపోయింది. ఒకనాడు రాత్రి అకస్మాత్తుగా టప్‌మన్న శబ్దం. కంటిలో ఒక రంధ్రం మాత్రం పడింది. యిప్పుడు ట్రీట్‌మెంటు యిస్తు న్నారు. నయమవుతుంది అంటారు కాని నాకు నమ్మకంలేదు.

యిది జరిగిన తర్వాత అతడు జ్ఞాపకం వచ్చినప్పుడు స్ట్రయిక్ అయింది. యీ నా కన్ను పోవడానికీ అతడితోడి నా యీ కథకూ యేదైనా సంబంధం వుందేమో అనుకుంటాను. దేముడు యిది నాకిచ్చిన శిక్షయేమోనని అనుమానం కలుగుతుంటుంది. ★

*(వినోదిని: నవంబర్, 1945)*